క్లుప్తంగా

అన్ని స్థానాల్లో గెలుస్తాం

వెల్దుర్తి(తూప్రాన్): త్వరలో జరగనున్న మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఆ పార్టీ నాయకులు నరేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సీనియర్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధిక ఎంపీటీసీ స్థానాలు గెలుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు మల్లేశం, హన్మేష, శేఖాగౌడ్, శేఖర్, క్రిష్ణ, రాములు పాల్గొన్నారు.

అంటరానితనం అమానుషం



మాట్లాడుతున్న ఎస్సై రాజు

వెల్దుర్తి(తూప్రాన్): అంటరానితనం అమానుషమని, గ్రామాల్లో సాంఘిక అసమానతలు పాటించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ఎస్సై రాజు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బస్వాపూర్ పంచాయతీ పరిధి పంతులుపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనం, వివక్ష వంటివి కొనసాగుతున్నాయా? గుడిలో దర్శనానికి ఎవరైనా అడ్డు చెబుతున్నారా? అని ఎస్సీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గిర్దావర్ నర్సింగ్యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బతుకమ్మ' ఏర్పాట్ల పరిశీలన

తూప్రాన్: మున్సిపల్ కేంద్రంలో బతుకమ్మ నిమ్మజనానికి అధికారులు పెద్ద చెరువుకట్ట వద్ద ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ జయచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువు అలుగు పారుతున్నందున, మెయిన్ రోడ్ పక్కన ఉన్న చెరువు ప్రదేశం వద్ద ఉత్సవాలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నర్సాపూర్: ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవేళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే ఎస్సీ ఉపకులాలకు ఆర్డీఓ నుంచి కాకుండా తహసీల్దార్ నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ నుంచి సర్టిఫికెట్లు పొందాలంటే మూడు నెలలు పడుతుందని, దీంతో చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భారత్ విశ్వగురువుగా ఎదగాలి

చేగుంట(తూప్రాన్): భారత్ విశ్వగురువుగా ఎదిగేలా తీర్చిదిద్దడానికి భారతయులంతా సంఘటితంగా ఉండాలని వీహెచ్‌పీ మెదక్ జిల్లా సంఘటన కార్యదర్శి పుట్టిమల్లేశం అన్నారు. మండలంలోని చందాయిపేట గ్రామంలో మంగళవారం రాత్రి ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా విజయదశమి ముందస్తు సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో నగేశ్, రమేశ్‌గౌడ్ ఆంజనేయులు శోభన్, రామకృష్ణ, లక్ష్మణ్, వెంకటరమణ, బాలేశ్, మల్లేశం పాల్గొన్నారు.

ఇంపాక్ట్‌లో ప్రతిభ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి కాకిజన్‌వాడకు చెందిన గానీ సోని, రాఘవాపూర్ గ్రామానికి చెందిన యువకుడు నాందేవ్ ఇంప్యాక్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. టీటీటీడబ్ల్యూ (ట్రైన్ ది ట్రైనర్ వర్క్ షాప్) వారు ఇంప్యాక్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై యువతి, యువకులకు 35 రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2 రోజుల పాటు హైదరాబాద్‌లో లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేక్ష శిక్షణా తరగతులు నిర్వహించారు. అందులో సోని, నాందేవ్ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వారికి ఇంప్యాక్ట్ ఫౌండర్ నాగేశ్వర్‌రావు శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు.

గోమాతకు అంత్యక్రియలు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలం తడ్కల్‌లోని ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో ఆవు మంగళవారం మృతి చెందింది. కాలనీ వాసులు బాజ భజంత్రీలతో ఉరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. చిన్న గంగారాంకు చెందిన గోవు మరణించడంతో సనాతన ధర్మం పాటించి ఖననం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తడ్కల్ క్లస్టర్ కోశాధికారి ఎర్రోళ్ల డేవిడ్, ప్రధాన కార్యదర్శి చిలుక గంగారాం, కార్యదర్శి ఎర్రోళ్ల రాజు, సభ్యులు సల్మాన్, చిలుక రాములు, మహిళలు పాల్గొన్నారు.

సద్దుల సంబురం

చిత్తూ చిత్తుల బొమ్మ...శివుని ముద్దుల గుమ్మ అంటూ.. జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం సద్దుల పండుగ అట్టహాసంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఆలయాల ప్రాంగణాలు పెద్ద పెద్ద బతుకమ్మలతో కళకళలాడాయి. మహిళలు, యువతులు, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాడుతూ ఆడుతూ పరవశించిపోయారు. దీంతో పట్టణమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అనంతరం స్థానికంగా చెరువులు, కాల్వలలో నిమజ్జనం చేశారు.



కౌడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొల్చారంలో సద్దుల బతుకమ్మ సంబురాలు



మెదక్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పాపన్నపేటలో బతుకమ్మ ఆటలు ఆడుతున్న మహిళలు



రేగోడ్: తిమ్మాపూర్‌లో ..



టేక్మాల్: దాదాయిపల్లిలో..



చిన్నశంకరంపేట(మెదక్): చందంపేటలో..



హవేళిఘణాపూర్: బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తూ..



పెద్దశంకరంపేట(మెదక్): తిరుమలాపూర్‌లో..



పెద్దశంకరంపేట(మెదక్):బూర్గుపల్లిలో.. .



అల్లాదుర్గం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

లోక కల్యాణార్థం మహా చండీహోమం



అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



మనోహరాబాద్: కాళ్లకల్ బంగారమ్మ దేవాలయంలో చండీహోమం చేస్తున్న దుర్గా మాలధారులు



హవేళిఘణాపూర్: శమ్నాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు



పెద్దశంకరంపేట: పూజల్లో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి వెల్దుర్తి మండల వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా కుకునూర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపం వద్ద మంగళవారం లోక కల్యాణార్థం భవానీ మాలధారులు వేద పండితులతో మహా చండీహోమం నిర్వహించారు. పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమంలో భవానీ మాలలు ధరించిన భక్తులతో పాటు మహిళలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించారు.

వాహనాల తనిఖీ

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధి పాతూర్ శివారులో మెదక్‌రూరల్ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికలను దృష్ట్యా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. పండుగ వేళ ఆయా ప్రాంతాలకు వెళ్లే సమయంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మధు, సిబ్బంది వేణు తదితరులు ఉన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

క్రికెట్ కిట్ అందజేత



చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లి గ్రామ యువతకు మంగళవారం జీఐ టెక్ పరిశ్రమ ప్రతినిధులు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో గ్రామంలోని యువకులకు క్రికెట్ కిట్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఐ టెక్ పరిశ్రమ ప్రతినిధులు పుల్లయ్య, ఈశ్వర్, రాజేశ్, కుర్మయ్య, హరిశేఖర్, మణితో పాటు గ్రామ క్రీడాకారులు ఉన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా జరిగే నీటి సరఫరాకు కొన్ని రోజుల పాటు అంతరాయం ఉంటుందని డీఈ ప్రవీణ్‌కుమార్, జేఈ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ చెక్రియాల్ నుంచి బోర్పట్ల నీటి శుద్ధి కేంద్రానికి గతంలో మాదిరిగా నీరు సరఫరా కాకపోవడం వల్ల పైపులైను పరిశీలించాల్సి ఉందన్నారు. అయితే వెండికోల్ గ్రామం సమీపంలో మంజీరా నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడం వల్ల పరిశీలించే అవకాశం లేదని, ప్రవాహం తగ్గిన తర్వాత లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపడతామని చెప్పారు. దీంతో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలతోపాటు సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల్ల, జిన్నారం మండలాల్లోని గ్రామాలకు నల్లాల ద్వారా నీరు పాక్షికంగా సరఫరా అవుతుందన్నారు. స్థానికంగా ఉండే నీటి వనరుల నుంచి నీటిని వినియోగించుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

సదాశివపేట(సంగారెడ్డి): నగర సంకీర్తనలో భాగంగా మంగళవారం పట్టణంలోని లోపలి కోట హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం, లింగాష్టక పారాయణం సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



విజేతలతో నిర్వాహకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం గ్రామస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తొమ్మిది జట్లు పాల్గొని సత్తా చాటాయి. మొదటి రెండు స్థానాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు నిర్వాహకులు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సంతోష్‌రావు, వెంకటేశం గుప్తా, మల్లేశం, మధుసూదన్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను కలిసికట్టుగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల బీజేపీ అధ్యక్షుడు బక్క వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో జిల్లా నాయకులతో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరం పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దామని , గ్రామాలలో పార్టీని బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్‌చారి, మల్లేశ్, మహేశ్, చంద్రశేఖర్, సాయిబాబ, ప్రభాకర్‌గౌడ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

దుర్గామాతాగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఆలయాలు, మండపాల వద్ద భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అర్చనలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న దానం చేశారు.



గోమారంలో దుర్గామాత అలంకరణలో..



కొల్చారం(నర్సాపూర్): అంసాన్పల్లిలో..



నర్సాపూర్ ధర్మశాలలో..



కౌడిపల్లిలో దుర్గాదేవికి బోనాలు తీస్తున్న మహిళలు



పాపన్నపేట(మెదక్) మహాగౌరి అలంకరణలో..



కొర్విపల్లి కనకదుర్గ ఆలయంలో..



పాపన్నపేట(మెదక్) వన దుర్గమ్మకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దంపతులు



పాపన్నపేట(మెదక్): దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పద్మ